క్లుప్తంగా

తాగునీటి ఎద్దడిపై ప్రత్యేక శ్రద్ధ

శిరివెళ్ల: ఈ వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్త కుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటు న్నామని ఈఓఆర్డీ శ్రీనివాసశర్మ సోమవారం తెలిపారు. నివారణకు ప్రతి గ్రామ పంచాయ తీలో నిధులు ఉన్నాయన్నారు. చెడిపోయిన చేతి పంపులను మరమ్మతులు చేయిస్తు న్నామని చెప్పారు. అలాగే తాగునీరు కలుషితం కాకుండా పైప్‌లైన్లలో లీకేజీలు అరిక ట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించా మన్నారు. ఈ నెలాఖరులోగా వంద శాతం ఇం టి పన్నులు, నీటి పన్నులు వసూలు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. సకాలంలో పన్నులు చెల్లించాలని ప్రజలను కోరారు.

ప్రతి అర్జీ పరిష్కారానికి కృషి

ఉయ్యాలవాడ: ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని పరిష్కరించేందుకు ఆయా శాఖల అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ ఉమామహేశ్వ రరావు, తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిం చారు. అనంతరం అధికారులతో సమీక్షిం చారు. క్షేత్రస్థాయిలో వెళ్లి ప్రజలు ఇచ్చిన అర్జీ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని పరిష్కరించి నప్పుడే ఉద్యోగులకు గ్రామాల్లో గుర్తింపు లభి స్తుందన్నారు. కొందరు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ద్వారా చెడ్డ పేరు వస్తోంద న్నారు. ప్రతి ఉద్యోగి బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.

9న జిల్లా స్థాయి చెస్ పోటీలు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని వివేకానం ద ఆడిటోరియంలో ఈనెల 9వ తేదీన జిల్లా స్థా యి చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నంద్యాల జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రవికృష్ణ, రామసుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. వారు మాట్లాడుతూ 17 సంవత్సరా ల్లోపు బాలబాలికలకు వేర్వేరు విభాగాల్లో పోటీ లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ఎంపికై న క్రీడాకారులు రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో పా ల్గొంటారన్నారు. 8వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

21నుంచి ఎస్‌వీఆర్‌లో 'ధిల్లానా'

నంద్యాల(అర్బన్): స్థానిక ఎస్‌వీఆర్ ఇంజినీ రింగ్ కళాశాలలో ఈనెల 21, 22వ తేదీల్లో సాంస్కృతిక మహోత్సవం ధిల్లానా–2025 కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కళాశాల వ్యవ స్థాపకులు వెంకటరామిరెడ్డి, ఎండీ దినేష్‌రెడ్డి తెలిపారు. సోమవారం కార్యక్రమానికి సంబం ధించిన పోస్టర్లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ.. పోస్టర్ ప్రజెంటేషన్, పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్టు ఎక్స్‌పో టెక్నిక్ క్విజ్ లాంటి సాంకేతిక పోటీలు ఉంటాయన్నారు. విజేతలకు దాదాపు రూ.2లక్షల విలువైన బహుమతులు అందజేస్తామని చెప్పారు.కం ట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ సూర్యప్రకాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

98శాతం పింఛన్ల పంపిణీ

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో మూడవ రోజు సోమవారం నాటికి 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్‌రెడ్డి తెలి పారు. నంద్యాల జిల్లాలో 2,15,061 పింఛన్లకు గాను 2,11,309 పింఛన్లు పంపిణీ చేశామని, మిగతా పింఛన్లను పంపిణీ జరుగుతుందన్నారు.

పరీక్ష కేంద్రంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూని యర్ కళాశాలలో సోమవారం ఇంటర్మీడియెట్ సెకండ్ ఇయర్ పరీక్షలు జరిగాయి. ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి శంకరనాయక్, డీఈఓ సునీత తనిఖీ చేశారు. కేంద్రంలోని గదులు, విద్యా ర్థులకు కల్పించిన వైద్యం, తాగునీటి సదుపా యాలను పరిశీలించారు. కాపియింగ్‌కు అవ కాశం ఇవ్వవద్దని కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రమణకుమారి, డిపార్ట్‌మెంట్ అధికారి రామ్మో హన్‌ను ఆదేశించారు. ద్వితీయ సంవత్సరం పరీ క్షలకు 118 మంది విద్యార్థులు రాయాల్సి ఉండం గా 116 మంది పరీక్షలకు హాజరయ్యారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

రుద్రవరం: మండల పరిధిలోని ఎర్రగుడిది న్నె–జాతీయ రహదారి మధ్యలో సోమవారం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో దంప తులు గాయపడ్డారు. వివరాలు.. అహోబిలా నికి చెందిన గురుస్వామి, బాలమ్మ దంపతులు సోమవారం మోటర్ సైకిల్‌పై నంద్యాలకు వెళ్లారు. అక్కడ పని పూర్తి కాగానే తిరుగు ప్రయాణంలో ఎర్రగుడిదిన్నె మీదుగా వెళ్తు న్నారు. జాతీయ రహదారి నుంచి కొద్ది దూరం వెళ్లాక ప్రమాద వశాత్తు మోటర్ సైకిల్ అదుపు తప్పడంతో ఇద్దరూ కిందపడ్డారు. గాయపడిన ఇద్దరినీ చికిత్స నిమిత్తం 108లో ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

మసీదుల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి

నంద్యాల(వ్యవసాయం): రంజాన్‌ను పురస్క రించుకొని పట్టణంలోని మసీదుల పరిసరా లను శుభ్రంగా ఉంచాలని ఎస్‌డీపీఐ నాయ కులు కోరారు. ఈ మేరకు సోమవారం మున్సి పల్ చైర్‌పర్సన్ మాబున్నిసాకు వినతి పత్రం అందజేశారు. అధ్యక్షుడు ఎజాస్ హుసేన్ మాట్లాడుతూ ప్రార్థనా మందిరాల వద్ద, ప్రధాన కూడళ్ల వద్ద మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. మజీద్‌ఖా న్, కరీముల్లా, హనీఫ్, అబ్దుల్‌జలీల్, అక్తర్‌హు సేన్ పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు ప్రణాళికలు రూపొందించాలి

- సర్వేలన్నీ నిర్ణీత వ్యవధిలోపు పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజకుమారి



మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశిం చారు. సోమవారం కలెక్టరేట్లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగం గా జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తాగునీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు బోర్ వెల్స్ డీపెనింగ్, ఫ్లషింగ్, పైప్‌లైన్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది చేపట్టిన పీ–4 సర్వే 15 శాతం పెండింగ్‌లో ఉందని త్వరితగ తిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న 38 శాతం ఎంఎస్‌ఎంఈ సర్వేతో పాటు వర్క్‌ఫ్రం హోం, మిస్సింగ్ ఎం ప్లాయిస్, మిస్సింగ్ సిటిజన్ హౌస్ హోల్డ్ డేటా, చైల్డ్ ఆధార్ అప్‌డేట్ తదితర సర్వేలన్నీ నిర్ణీత వ్యవ ధిలోగా పూర్తి చేయాలని చెప్పారు. శిరివెళ్ల మం డలం అన్ని పారామీటర్ల సర్వేలో వెనుకబడి ఉం దని పనితీరు మెరుగుపరుచుకుని వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ సం క్షేమ వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థు లందరికీ మెనూ ప్రకారం ఆహార పదార్థాలు ఇవ్వా లన్నారు. పరీక్షల సమయంలో పిల్లల ఆరోగ్యం సరిగా చూసుకోవడంతో పాటు పౌష్టికాహారాన్ని అందించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ రీ సర్వే, మ్యుటేషన్ దరఖాస్తుల పరి ష్కారానికి తహసీల్దార్లు, ఆర్‌డీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. డీఆర్‌ఓ రామునాయక్, స్పె షల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ టాక్స్ సరైన పద్దుకు జమచేయండి

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతం నుంచి మిన హాయింపయ్యే సర్వీస్ టాక్స్ సరైన పద్దు కింద జమయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఈఎస్‌ఐ (సర్వీస్ టాక్స్) మిన హాయింపుపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల జీతం నుంచి ప్రతి నెల సర్వీస్ టాక్స్ చెలిస్తున్నారా లేదా? ఒకవేళ మినహాయింపు అయ్యే ఈఎస్‌ఐ సర్వీసు టాక్స్ ఏ పద్దు కింద జమ అవుతుం దనే అంశాలపై జిల్లా అధికారులకు అవగా హన ఉండాలన్నారు. సర్వీసు టాక్స్ చెల్లిం చడం ద్వారా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఈఎస్‌ఐ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య చికిత్స పొందే అవకాశం ఉంటుందన్నారు. వచ్చే సోమవారం అన్ని శాఖల్లో ఉన్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాలతో రావాలని, సర్వీసు టాక్స్ ఏ పద్దు కింద జమవుతుందనే విషయా లపై సమీక్షిస్తానన్నారు. ఈఎస్‌ఐలో నమోదయ్యే విషయాలపై వారికి అవగాహన కల్పించాలని ఈఎస్‌ఐ కార్పొరేషన్ బ్రాంచ్ మేనేజర్ దుర్గ ప్రసాద్‌ను ఆదేశించారు.

ఓపెన్ ఇంటర్ పరీక్షలకు 48 మంది గైర్హాజరు


పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డీఈఓ జనార్దన్‌రెడ్డి

నంద్యాల(న్యూటౌన్): జిల్లా వ్యాప్తంగా సోమవారం జరిగిన ఓపెన్ ఇంటర్మీడియెట్ ఇం గ్లిషు పరీక్షకు 48 మంది విద్యార్థులు గైర్హాజ రయ్యారు. జిల్లాలో ఐదు కేంద్రాల్లో జరిగిన పరీక్షకు 697 మంది విద్యార్థులకు గాను 649 మంది హాజ రయ్యారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ టీం , సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశారు. నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని డీఈఓ జనార్దన్‌రెడ్డి పరిశీలించారు. ఈయన వెంట ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ మహబూబ్‌బేగ్, డిప్యూటీ డీఈఓ శంకర్‌ప్రసాద్, వెంకటరామిరెడ్డి ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): మున్సిపల్ కార్మికుల సమ స్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏఐటీయూసీ రాష్ట్ర సమితి పిలుపు మేరకు జిల్లా కలె క్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. నూనెపల్లె నుం చి ర్యాలీగా బయల్దేరి కలెక్టరేట్ వరకు చేరుకు న్నారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుం కయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి శివబాలకృష్ణ మాట్లా డుతూ మున్సిపల్ రంగంలో కాంట్రాక్ట్ విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొని రావడానికి యత్నిస్తోంద ని, దీన్ని ఉపసంహరించుకొని మున్సిపల్ కార్మికు లందరినీ రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమా న వేతనం ఇవ్వాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న పీఎఫ్, ఈఎస్‌ఐ సమస్యలను పరిష్కరించాల న్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 11న విజయవాడలో జరిగే సీఎం క్యాంపు కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. శ్రీనివాసులు, భువన శ్రీనివా సులు, ఓబులేసు, రంజిత్, ప్రతాప్, శివరాం, మస్తా న్, ఎస్తేరమ్మ పాల్గొన్నారు.

పశు వ్యాధులపై అప్రమత్తత అవసరం


హరివరంలో ఆవుకు గాలికుంటు టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ఉయ్యాలవాడ: పశువులకు సోకే వ్యాధులపై పాడి రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికా రులు నాగశైలజ, రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హరివరం, ఉయ్యాల వాడ గ్రామాల్లో జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద టీకాల కార్యక్రమాన్ని చేపట్టారు. నాలుగు నెలల నుంచి 8 నెలల వరకు వయస్సు ఉన్న దూడలకు గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధుల నివారణకు టీకాలు వేస్తున్నట్లు వెల్లడిం చారు. ఈ నెల 30వ తేదీ వరకు వ్యాధి నివారణ టీకాలు వేస్తామని తెలిపారు. సద్వినియోగం చేసు కోవాలని సూచించారు.

చెరువు కట్టలపై పనులు ప్రారంభం



కొండమాయపల్లె చెరువు కట్టపై పిచ్చి మొక్కలను తొలగిస్తున్న జేసీబీ, కట్టను చదును చేసిన దృశ్యం

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లె, బి.నాగిరెడ్డిపల్లె చెరువు కట్టలపై పెరిగిన పిచ్చి మొక్క ల తొలగింపు, చదును పనులను సోమవా రం ప్రారం భించారు. చెట్లు, మొక్కలు లేని చోట జేసీబీతో కట్టను చదును చేసినట్లు గీతలు పెడుతూ జంగిల్ క్లియర్‌ను మమ అనిపిస్తున్నారు. కాగా మండలంలో మొత్తం 16 చెరువులు ఉన్నాయని చిన్నతరహా నీటి పారుదల శాఖ ఏఈ రఘురాం తెలిపారు. వాటిలో 11 చెరువు లకు రూ.14 లక్షల నిధులు కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల అయినట్లు చెప్పారు. ఆ నిధులు కేవలం జం గిల్ క్లియరెన్స్‌కు మాత్రమే అన్నారు. వచ్చిన నిధులతో పనులు ప్రారంభించినట్లు తెలిపారు.


డబ్ల్యూ గోవిందిన్నె పొలాల్లో చెట్టునీడన సేదతీరుతున్న గొర్రెల మంద

మొదలైన భానుడి ప్రతాపం


శ్రీప్పిపాడులోని కుందూనదిలో చిన్నారుల ఉపశమనం

దొర్నిపాడు: వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు కనిపిస్తున్నాయి. రెండు రోజులుగా తెల్లారిందే మొదలు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. అప్పుడే మార్చిలో మే వచ్చినట్లు ఎండలు మాడగొడుతున్నాయి. ఉదయం 9గం టలు దాటితే సరి బయట తిరిగేందుకు ఎవరూ సాహసించలేకపోతున్నారు. సోమవారం 33 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. గొర్రెల కాపరులు పొలాల్లో చెట్లకిం ద మందను సేదతీరుస్తున్నారు. ఇక చిన్నారులు, యువకులు ఎండ తాపం తట్టుకోలేక నదుల్లో ఈత కొడుతూ ఉపశమనం పొందుతున్నారు. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉంది. వృద్ధులు, చిన్నారులు, గర్భి ణులు బయటకు రాకపోవడమే మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశుడి దంపతులు


మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో ఆలయ ఈఓ నల్ల కాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. వేదపం డితులు, అర్చకులు ముందుగా స్వామి, అమ్మవా ర్లను విశేషంగా అలంకరించి పల్లకీలో కొలువు తీర్చారు. స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవారికి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకీ ఉత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. కాగా రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చి కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచ రించి కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకున్నారు.

6 నుంచి పాండురంగస్వామి వార్షికోత్సవాలు


పాండురంగస్వామి

నంద్యాల(అర్బన్): ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు మండలంలోని పాం డురంగాపురం గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణీ సమేత పాండురంగ, వేణు గోపాల, గణపతి కామేశ్వరి, నంది సమేత కామేశ్వర, అభయాం జనేయ, సుబ్రహ్మణ్యేశ్వర, వీరభద్ర, నవగ్రహ సమేత 32వ వార్షికోత్సవ మహోత్సవాలు నిర్వ హిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6న గణపతి పూజ, పుణ్యాహవాచనం, 7న ప్రాతఃకాల పూజలు, అభిషేకాలు, 8న రుక్మిణీ సమేత పాండురంగస్వామి తెప్పోత్సవం, 9న కల్యాణం, 10న గరుడ సేవ, గ్రామోత్సవంతో వేడుకలు ముగుస్తాయన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

గోస్పాడు: మండలంలోని యాళ్లూరు గ్రామంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షురాలు బెక్కెం శకుంతలమ్మ, గ్రామ సర్ప ంచ్ గడ్డం రత్నమ్మ సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. అవకాశాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని కోరారు. కార్యక్ర మం లో గ్రామ పెద్దలు,నాయకులు పాల్గొన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం


బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న మిత్రులు

రుద్రవరం: రెడ్డిపల్లెకు చెందిన నాగేశు అనే వ్యక్తి అనారోగ్యంతో కొద్ది రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అతని మిత్రులు సోమవారం తమ వంతు సాయంగా రూ.51,500 స్నేహితుడి కుమార్తె పేరుపై పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. దానికి సంబం ధించిన ధ్రువీకరణ పత్రాన్ని మృతుడి భార్య లక్ష్మీకి అందజేశారు. తామంతా 2002 నుంచి 2007 వరకు రుద్రవరం జెడ్పీ ఉన్నత పాఠశా లలో చదువుకున్నామని తెలిపారు. కాశీం, సురేంద్ర, మస్తాన్, మహేష్‌రెడ్డి, నరసింహ, లక్ష్మీనారాయణ, నాగేంద్ర, హుసేని, బాలచౌ దయ్య, ప్రసాదు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి


దివ్యాంగులకు వీల్‌చైర్స్‌ను పంపిణీచేస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజకుమారి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా వికలాంగులకు వీల్ చైర్లు, దివ్యాంగ విద్యార్థులకు ల్యాప్ ట్యాప్‌లను కలె క్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీల్ చైర్ కోసం దరఖాస్తు చేసుకున్న ఐదుగురికి మూడు చక్రాల సైకిళ్లు పంపిణీ చేశామ న్నారు. అలాగే ఆరుగురు దివ్యాంగ విద్యార్థులకు రూ.30 వేలు విలువ చేసే ల్యాప్ ట్యాప్‌లను అందజే శామన్నారు. ఇక నుంచి వీల్‌చైర్స్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇంటి వద్దనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 8వ తేదీన అంత ర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా బాల్య వివాహాల నిర్మూలన కోసం సంతకాల సేకరణ చేపట్టామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు అన్ని మండలాల్లో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బాల్య వివాహాలకు వ్యతిరే కంగా కృషి చేస్తానని జిల్లా, డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, డీఆర్‌ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికా రులు పాల్గొన్నారు.

వినికిడి సమస్యలను పరిష్కరించుకోవాలి


ర్యాలీ నిర్వహిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ, అధికారులు



వినికిడి యంత్రాలను అందజేస్తున్న ఎంపీ శబరి

గోస్పాడు: వినికిడి సమస్యలు ఉన్న వారు సమ స్యను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించు కోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకటరమణ అన్నారు. సోమవారం పట్టణంలోని డీఎంఅండ్ హెచ్‌ఓ కార్యాలయం నుంచిర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వినికిడి లోపానికి కారణాలు–అవ గాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సాధారణంగా వచ్చే వినికిడి సమస్యలకు ప్రధాన కారణం పుట్టుకతో చెవి మూసుకొని పోవడం, వినికిడి సమస్యతో పుట్టడం, చెవిలో గులిమి పేరుకుపోవడం, కర్ణభేరి చిల్లు పడ టం, దీర్ఘకాలంగా చెవిలో చీము కారడం, శబ్ద కాలుష్యం వంటి కారణాలతో సమస్య తలెత్తుతుం దన్నారు. ర్యాలీలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్లు కాంతరావునాయక్, అంకిరెడ్డి, ప్రసన్నలక్ష్మి, రవీం ద్రనాయక్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

సైనికులకు ఉచిత వైద్య సేవలు..

నంద్యాల ఐఎంఏ ఆధ్వర్యంలో సోమవారం పట్ట ణంలోని మధుమణి నర్సింగ్ హోం సమావేశ భవ నంలో వీరసైనికునికి వందనం పేరిట సైనికులు, వారి కుటుంబాలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహిం చారు. నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురికి వినికిడి యంత్రాలను అందజేశారు. డాక్టర్లు రవికృష్ణ, ఫణి ల్‌కుమార్, సహదేవుడు, నాగమణి, మాధవి, కార్తీక్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక


పోటీలకు ఎంపికైన క్రీడాకారులు


క్రీడాకారిణిని అభినందిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని గుడ్‌షెప్పర్డ్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ జెస్సీపాల్ సోమవారం తెలిపారు. ఈనెల 1, 2 తేదీల్లో ఎన్‌టీఆర్ జిల్లా నందిగామ దగ్గరున్న ఏకత్వ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్రస్థాయి క్రీడల్లో చెమ్మిరెడ్డి, తీక్షణరెడ్డి మొదటి బహుమతి గోల్డ్ మెడల్, వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలిపారు. ఈ నెల 27, 28, 29 తేదీల్లో ఒడిశా రాష్ట్రంలోని కటక్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. అలాగే.. అండర్–14 సబ్ జూనియర్ విభాగంలో నంద్యాల గురురాజ పాఠశాల విద్యార్థి ఓజో రంగసాయి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికై ందని పాఠశాల డైరెక్టర్ షేక్షావలిరెడ్డి తెలిపారు.

సాగునీటి కష్టాలు

- పెరుగుతున్న ఖర్చులు
- కలిసిరాని వ్యవసాయం
- ఆందోళనలో అన్నదాతలు


చిలుకలూరు వద్ద వాగులోని నీటిని తోడుతున్న ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజిన్లు


నువ్వుల పంటకు నీరు పారించుకుంటున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు సాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. రబీ సీజన్‌లో బోర్లు, తెలుగుగంగ కాల్వలు, చెరువుల కింద వరి, మొక్క జొన్న, మినుము, వేరుశనగ, పొగాకు వం టి పంటలు సాగు చేశారు. అయితే తెలుగుగంగ కాల్వ పరిధిలోని ఆయకట్టు రైతులు సాగునీటి కోసం ఇబ్బం దులు పడుతున్నారు. తెలుగుగంగ అధికారులు కాల్వ లకు పది రోజులు నీరు విడుదల చేసి ఆపై నిలిపే స్తున్నారు. తిరిగి పది రోజులు దాటాక నీరు విడుదల చేస్తున్నారు. అలా వదలినప్పుడు చివరి ఆయకట్టు పరిధికి నీరు చేరడం ఆలస్యం అవుతోంది. దీంతో సాగు చేసిన పంటలు వాడుముఖం పడుతున్నాయి. అసలే ఎండలు మండుతున్నాయి. ఒక్క రోజు నీటి తడులు పెడితే రెండు రోజులకే నేల ఎండుతోంది. అలాంటి సమయంలో పంటలు ఎండకుండా తడులు పారించుకునేందుకు రైతులు తంటాలు పడుతున్నారు. మండల పరిధిలోని ఎర్రగుడిదిన్నె, చిలుకలూరు, చం దలూరు, మందలూరు తదితర గ్రామాల రైతులు ర బీలో సాగు చేసిన వరి, మొక్కజొన్న, మినుము, నువ్వు లు, కూరగాయల పంటలను కాపాడుకునేందుకు సమీ పంలో ఉన్న వాగులు, వంకల్లో నిల్వ ఉన్న నీటిని ట్రాక్టర్లు, ఆయిల్ ఇంజిన్లతో పారించుకుంటున్నారు. అలా పారించుకోవడం వల్ల ఖర్చులు తడిసి మోపెడ వుతున్నాయి. చిలుకలూరు వద్ద వాగులో నుంచి అర కిలోమీటర్ దూరంలో సాగు చేసిన నువ్వుల పంటకు నీరు పారిస్తున్నారంటే పరిస్థితి అద్దం పడుతుంది.

వ్యవసాయం కలిసి రావడంలేదు



ఈ ఏడాది వ్యవసాయం కలిసి రావడంలేదు. ఏపంట సాగు చేసినా దిగుబడులు మోస్త రుగా వస్తున్నప్పటికీ మద్దతు ధర లేక నష్టపోతున్నాం. ఎండు మిర్చి పంట సాగు చేస్తే ధర ఢమాల్ అని పడిపోయింది. వరి చూస్తే బస్తా రూ.2వేలకు తగ్గింది. అవన్నీ కాద నుకుని 3.5 ఎకరాల్లో నువ్వుల పంట సాగు చేశాను. తెలుగుగంగ 19వ బ్లాక్ ఉప ప్రధాన కాల్వ పక్కనే ఉన్నప్పటికీ సరైన సమయంలో సాగునీరు అందడంలేదు. ఎర్రగుడిదిన్నె చెరువు అలుగు ద్వారా బయటకు వచ్చే నీరు వాగులో కలిసి పారుతుండడంతో ట్రాక్టర్లతో పారించుకుంటున్నా. దీంతో ఖర్చు పెరిగిపోతోంది.

– శీను, రైతు, చిలుకలూరు